క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్



చంద్రగిరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని చంద్రగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ సుబ్బరామిరెడ్డి వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా, సంఘం మండలం నుంచి అక్రమంగా ఇసుకను లోడ్డు చేసుకుని కర్ణాటకకు చెందిన లారీ చంద్రగిరి మీదుగా బెంగళూరు వైపు వెళ్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని పనపాకం టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

త్వరలో జపాన్ వర్సిటీతో ఒప్పందం

– ఎస్వీయూ వీసీ అప్పారావు



మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ప్రపంచస్థాయి కోర్సులు, పరిశోధనల కోసం జపాన్ వర్సిటీతో ఎంఓయూ చేసుకునేందుకు ఎస్వీయూకు ఆహ్వానం దక్కిందని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం 226.38 కోట్లు కేటాయించిందని, గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.15 కోట్లు పెరగడం సంతోషకరమన్నారు. మూడు రోజులుగా ఎస్వీయూలో కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో ×యువతరంగ్–24₹ దిగ్విజయంగా నిర్వహించారని కొనియాడారు. సమావేశంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రొఫెసర్ మురళీధర్, డాక్టర్ పి.హరికృష్ణ పాల్గొన్నారు.

భయపడొద్దు..

ప్రలోభాలకు లోనుకావొద్దు

- పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ప్రత్యేక కోర్టులు
- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు ఉంచకండి
- అవగాహన సదస్సులో ఎస్పీ, కలెక్టర్

తిరుపతి క్రైమ్: బాలికలు, మహిళలు భయపడొద్దు.. ప్రలోభాలకు గురికావద్దని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. సోమవారం పద్మావతి కాలేజీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సైబర్ నేరగాళ్లు, డ్రగ్, అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు హాజరయ్యారు. ఆయనతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 900 పాఠశాలల నుంచి వర్చువల్‌గా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ డీజీపీ విద్యార్థులకు సైబర్ క్రైమ్‌లు, మాదక ద్రవ్యాల వినియోగం, చిన్నపిల్లలు, మహిళలపై జరుగుతున్న రాజకీయాల గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

అనంతరం ఎస్పీ, కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఆడపిల్ల, మహిళా నేటి ఆధునిక తరంలో శక్తివంతంగా ఉండాలని ఆకాంక్షించారు. సైబర్ క్రైమ్ ద్వారా యువతీయువకులు ఎక్కువగా ప్రలోభాలకు గురవుతున్నారని, సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితుల్లో ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న పిల్లల చేత భిక్షాటన చేయించేలా కొందరు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో మహిళా పోలీసులు బాల్యవివాహాల నిర్మూలన దిశగా శ్రద్ధ పెట్టాలని చెప్పారు.



హాజరైన అధికారులు, విద్యార్థులు

శిక్షలు పడుతున్నా నేరాలకు పాల్పడుతున్నారు

సమాజంలో మహిళలు, చిన్నపిల్లల పట్ల అనేక నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చట్ట పరంగా కఠినంగా శిక్షలు విధిస్తున్నా మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని కలెక్టర్, ఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఏదైనా తెలిస్తే 100, 112, తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 80999 99977కు సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. టీనేజ్ పిల్లలు, యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మహిళా విశ్వవిద్యాలయం ఉపకులాపతి ఉమా, అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), శ్రీరవిమనోహరాచారి, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీలత, మహిళా యూనివర్సిటీ రిజిస్టర్ రజిని, సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగజాతరలో సిండికేట్లా?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- కులమతాలకు అతీతంగా జరిగే జాతరను రాజకీయం చేయకండి
- శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే హితవు

శ్రీకాళహస్తి: ఆచారంగా వస్తున్న ఏడు గంగమ్మల జాతర ఉత్సవ కమిటీ రాజకీయ జోక్యం తగదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్‌ఆర్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగి సుబ్బరామిరెడ్డి నుంచి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి వరకు ఎప్పుడూ గంగజాతర కమిటీలో ఎవరూ జోక్యం చేసుకోలేదన్నారు. కానీ నేడు ఎన్నో తరాలుగా కొనసాగుతున్న ఉత్సవ కమిటీలను పక్కన పెట్టి తాము నిర్వాహకులమంటూ కొందరు దందాలకు పాల్పడాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే జరిగే ఏడు గంగమ్మల జాతర కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చేసుకునే పండుగని, ఆ ప్రతిష్టను దిగజార్చి మద్యం సిండికేట్‌లాగా చేయాలనుకోవడం బాధ కలిగించిందన్నారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్లలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఎస్పీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నించే మీడియా ప్రతినిధులపై గంజాయి కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఆలయ కాంట్రాక్టుల్లో గోల్‌మాల్

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి క్రాప్ టెండర్‌లో గోల్‌మాల్ జరిగిందని... గతంలో రూ.23కు కొనుగోలు చేసిన ఐరన్‌ను ఇపుడు టీడీపీ నాయకులకు రూ.11కే కట్టబెట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే ఆక్షేపించారు. దుర్గమ్మ కొండపై ఏర్పాటు చేసిన రేకుల షెడ్డుకు టెండర్లు పిలవకనే పనులు చేయడంలో మతలబు ఏంటో చెప్పాలని నిలదీశారు. ఆ పని చేసిన దాతల వివరాలను శిలాఫలకంపై ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, శ్రీవారి సురేష్, కృష్ణయ్య, విజయకుమార్, రవి, పెరుమాళ్, మహేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతిలోని ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో జరిగిన క్రీడ, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రసంగించారు. విద్యార్థి దశ కీలకమని, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నప్పుడే తమలోని సృజనాత్మకశక్తి బయట పడుతుందన్నారు. అనంతరం ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుందన్నారు. ఈ పోటీలలో రాష్ట్రంలో ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని సుమారు 18 కళాశాలల నుంచి 410 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగేఈ సమ్మేళనంలో మొదట రోజు బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్ విభాగాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, వ్యవసాయ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవి కాంత్‌రెడ్డి, బోధనా పాల్గొన్నారు .



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రుయాలో అదనపు ఓపీ కేంద్రాలు



నూతన కేంద్రాలలో ఓపీ తీసుకుంటున్న రోగులు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు ఓపీ కేంద్రాలను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రవి మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం ఓపీ కేంద్రాలను పెంచామని తెలిపారు. దీంతో రుయాలో ఓపీ కేంద్రాలు ఏడుకు పెరిగాయన్నారు. ఎంత రద్దీ ఉన్నా సుమారు 11గంటలలోపు ప్రతి రోగికీ ఓపీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. త్వరలో మరో రెండు ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

టీడీపీ రక్తచరిత్రకు యువకుడి బలి



ఎమ్మెల్యేతో నిందితుడు జగన్ (వృత్తంలోని వ్యక్తి)

- బర్త్‌డే పార్టీలో యువకుడికి కత్తిపోట్లు
- పాత కక్షల కారణంగానే దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తెలుగుదేశం పార్టీ నాయకుల రక్త చరిత్ర, అరాచకాలకు ఓ యువకుడు బలయ్యాడు. టీడీపీకి చెందిన యువకులు జగన్, వాసుదేవ, మునిరాజా, భరత్‌కుమార్ ఈనెల 6వ తేదీ సాయంత్రం పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలో తమ స్నేహితుడు విష్ణువర్ధన్ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయ సమీపంలో కేక్ కట్ చేశారు. పాతగొడవల కారణంగా కేక్ కట్ చేసిన కత్తితోనే జగన్ అనే యువకుడు విష్ణువర్ధన్‌పై దాడికి తెగబడ్డాడు. నాలుగు పోట్లు పొడవగా.. మిగిలిన వారు అతనికి సహకరించారు. తీవ్ర గాయాలపాలైన విష్ణువర్ధన్‌ను స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఐదు రోజులు రుయాలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ హత్యకు కారణమైన వారందరూ టీడీపీ వారే. ఇదిలావుండగా మృతునికి అమ్మానాన్న లేరు. సుబ్బు, విష్ణువర్ధన్ అన్నదమ్ములు కాగా.. అన్న సుబ్బు మధ్యలోనే చదువు ఆపేసి తమ్ముడు విష్ణువర్ధన్‌ను చదివిస్తున్నాడు. అయితే విష్ణువర్ధన్ చనిపోవడంతో కుటుంబంలో విషాదం అలముకుంది. దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్న డిమాండ్ చేశారు.

బాలుడిపై పోక్సో కేసు

- బాలిక వాంగ్మూలం ఆధారంగా చర్యలు
- ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: ఎర్రావారిపాళెం మండలం, యల్లమందలో ఈనెల నాలుగో తేదీన జరిగిన ఘటనలో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి చదువుతున్న బాలిక, బాలుడు స్నేహితులని తెలిపారు. ఈనెల నాలుగో తేదీ సాయంత్రం బాలిక బడి నుంచి బయట వచ్చాక స్నేహితుడితో కలసి వెళుతూ ఇంటికి చేరుకునేందుకు ఆలస్యం అయ్యింది. దీంతో తల్లిదండ్రులు వెతుక్కుంటూ వెళ్లారన్నారు. తనను ఎక్కడ కొడుతారో అన్న భయంతో బాలిక తనపై ముసుగు వేసుకుని మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి దాడిచేశాడని అబద్ధం చెప్పింది. తల్లిదండ్రులు ఆమెను యల్లమంద ప్రాథమిక వైద్యకేంద్రానికి తీసుకెళ్లారన్నారు. అనంతరం పోలీసులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి మెటర్నిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. డీఎస్పీ, తహసీల్దార్, మహిళా పోలీసులు, ఐసీడీసీ అధికారులు, తల్లిదండ్రుల సమక్షంలో బాలికను విచారించగా ఈ నాటకం బయటపడిందన్నారు. తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో గాజులతో చేతికి గాయం చేసుకున్న బాలిక.. ముసుగు వ్యక్తులు దాడిచేసి మత్తు మందు తాగించారని నమ్మించిందని చెప్పారు. ఆ బాలుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

సున్నిత విషయాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇలాంటి సున్నితమైన విషయాలు జరిగిన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పోక్సో కేసుకు సంబంధించి బాలిక వివరాలు తెలిసేలా ఏదీ చేయకూడదన్నారు. ఈ కేసులో నిజానిజాలు తెలుసుకోకుండా.. దర్యాప్తు అధికారులకు కనీసం సమయం కూడా ఇవ్వకుండా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేశారని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏఎస్పీలు వెంకటరావు, రవిమనోహరాచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్టు తీస్తున్నారు!

- మత్తు వదిలిస్తున్న అధికారులు
- రంగంలోకి జిల్లా కలెక్టర్, ఎస్పీ
- బెల్టు నిర్వాహకులను అరెస్ట్ చేయాలని ఆదేశాలు
- చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మర దాడులు
- నలుగురు అరెస్ట్, 212 మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లాలో 'బెల్టు' తీసేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు నడుం బిగించారు. ఎక్కడ బెల్టు షాపులు కనిపించినా వెంటనే అరెస్టులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బెల్టు రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులమై ఉన్నామని అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా 98 బెల్టు షాపులను నిర్వహిస్తున్నట్లు ఆధారాలతో పలు పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై ఆరా తీశారు. బడ్డీ కొట్లు, కూల్ డ్రింక్ షాపుల్లో నిత్యావసర సరుకుల్లా అమ్మకాలు చేస్తున్న వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగ మల్లేశ్వర్‌రెడ్డి స్పందించారు. మద్యం షాపుల వారీగా గ్రామాల్లో అమ్మకాలు చేస్తున్న బెల్టుషాపులు, వాటి నిర్వాహకులను అరెస్ట్ చేయాలని రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దీంతో చిత్తూరు నుంచి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, చంద్రగిరి, తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. బెల్టుషాపులను గుర్తించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో సోమవారం ఒక్కరోజే బెల్టుషాపులను నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలో వెంకటసుబ్బయ్యను, చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లిలో కళత్తూరు రామును, ఎర్రావారిపాళెం మండలం, మట్టువారిపల్లిలో శోభ, సుబ్బారెడ్డిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి 212 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క మట్టువారిపల్లిలోని సుబ్బారెడ్డి బెల్టుషాపులోనే కేసుల కొద్దీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. అతని నుంచి 142 మద్యం బాటిళ్లు, 12 బీర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు బయటపడడంతో ఎక్సైజ్ పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. బెల్టుషాపులపై నిరంతరం దాడులు కొనసాగిస్తామని చంద్రగిరి, తిరుపతి రూరల్ సీఐలు ఫణీంద్ర, నరసానాయుడు హెచ్చరించారు.



మద్యం విక్రయిస్తున్న వెంకటసుబ్బయ్యను అరెస్ట్ చేసిన రూరల్ ఎక్సైజ్ పోలీసులు

బెల్టు షాపులపై ఉక్కుపాదం

జిల్లాలో ఎక్కడా బెల్టు షాపులు అనేది లేకుండా చేస్తాం. నిరంతరం దాడులను కొనసాగిస్తాం. పక్కా ఆధారాలతో దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. బెల్టుషాపులను ప్రోత్సహించే అధికారులు, మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశాం.

– వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

యూత్ ఫెస్టివల్‌లో 'పద్మావతి' విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మూడు రోజులుగా నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభను కనబరిచారు. సోమవారం ఈ మేరకు బహుమతులు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ అభినందించారు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ సైన్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

చంద్రగిరి: ఉపాధ్యాయుడి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బంగారు నగలు, వెండి వస్తువులతో పాటు నగదు దోచుకెళ్లిన ఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. ఉపాధ్యాయులు వెంకటరమణ, ప్రసన్న లక్ష్మి రెండు రోజుల క్రితం ఒడిశాలో స్థిరపడిన కుమారుడి ఇంట్లో ఓ కార్యక్రమానికి వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. పడక గదిలోని అల్మారాలో సుమారు రూ.13 లక్షల విలువైన 20 సవర్ల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి, రూ.50వేల నగదుతో పాటు పట్టు చీరలను దోచుకెళ్లారు. ఉదయం తలుపులు తెరిచి ఉండడంతో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. సీఐ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ బాధితులు ఒడిశా నుంచి వస్తున్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.



చిందరవందరగా బెడ్ రూం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రామచంద్రాపురం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పచ్చికాపల్లం –తిరుపతి ప్రధాన రహదారి పీవీపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం, గుంతలచేను గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, కమలమ్మ భార్యాభర్తలు. వీరు తిరుపతిలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్యం, కమలమ్మ తన ద్విచక్ర వాహనంపై గుంతలచేను నుంచి తిరుపతికి వెళ్తుండగా పీవీపురం వద్ద ఆవు అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో వెనుకవైపు కూర్చున్న కమలమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి తిరుపతి రుయాకు తరలించారు. రుయా వైద్యులు పరీక్షించి అప్పటికే కమలమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. సుబ్రహ్మణ్యం రుయాలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలికి మూడేళ్ల పాప ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన కమలమ్మ

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ తదితరులు

తిరుపతి అర్బన్ : అఖిల భారత 71 సహకార వారోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర సహకార యూనియన్ ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీలక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణ, పెంచలయ్య, రవీంద్రనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాల నివారణ, మత్తు పదార్థాల వినియోగంతో వాటిల్లే నష్టాలపై సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించారు. సీఐ మద్దయ్య ఆచారి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. హద్దు మీరి ప్రవర్తించేవారితో మహిళలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. డ్రగ్స్, గంజాయి విక్రేతలకు సంబంధించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఉమామహేశ్వరి, బేబీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కించపరిచే వ్యాఖ్యలు దారుణం

తిరుపతి కల్చరల్ : నాయీబ్రాహ్మణులను కించపరిచిన కడప ముస్లిం మైనార్టీ నేత చాంద్‌బాషా వ్యాఖ్యలు దారుణమని, ఆయనపై కఠిన చర్య లు తీసుకోవాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు ఎస్.సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యక్రమాన్ని ముందుండి సంప్రదాయబద్ధంగా నడిపించేది నాయీబ్రాహ్మణులే అన్నారు. కొందరు అవగాహన రాహిత్యంతో తమ కులాన్ని దూషించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నేతలు కమల్, వెంకీ, కుమార్, నాగేష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న బాబు నాయుడు

తిరుపతి కల్చరల్ : టీకే స్ట్రీట్‌లోని శ్రీవెంకటశివ ఫుట్‌వేర్ 25వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఫుట్‌వేర్ అధినేత రాటకొండ బాబునాయుడు మాట్లాడుతూ తమ వ్యాపారాభివృద్ధి దోహదపడుతున్న కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. 10 శాతం డిస్కౌంట్‌తో ఫుట్‌వేర్స్ అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఫోక్ డాన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ వేదికగా మూడు రోజులుగా ఇంటర్ కాలేజిగేట్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా జరిగిన సాంస్కృత పోటీలలో గేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలవడం గర్వకారణమని చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు క్రీడ, సాంస్కృతిక విభాగాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు అభినందించారు.

బావిలో పడిన ఆవు

పాకాల: పొలంలో మేస్తూ ప్రమాదవశాత్తు ఓ ఆవు బావిలో పడిపోయిన ఘటన మండలంలోని మల్లెల చెరువులో చోటు చేసుకుంది. సోమవారం స్థానిక ఎస్ఎఫ్ఓ గుణశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మల్లెలచెరువు గ్రామానికి చెందిన మహదేవరెడ్డి ఆవు వారి పొలంలోనే మేస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడినట్లు సమాచారం అందిందన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, ఫైర్ సిబ్బంది తాడు సాయంతో ఆవును సురక్షితంగా బయటకు తీసి యజమానికి అప్పగించినట్ట వెల్లడించారు.సిబ్బంది రామకృష్ణ, పయణి,రాజేంద్రబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువత అభ్యున్నతే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : యువతలో నైపుణ్యత పెంచి అభ్యున్నతికి తోడ్పాటు అందించడమే ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని సంస్థ అధ్యక్షులు తహసున్నీసా బేగం తెలిపారు. సోమవారం న్యూ బాలాజీ కాలనీలోని మేక్ బేబీ జీనియస్ స్కూల్ ఫంక్షన్ హాల్లో క్లబ్ వేడుకలు నిర్వహించారు. జేసీఐ సీనియర్ నేషనల్ ట్రైనర్లు మనోహర్, కృష్ణమూర్తి, టెంకాయల దామోదరం, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ వితలం, ఇంపాక్ట్ ఈగల్స్ క్లబ్ అధ్యక్షుడు వైష్ణవ చరణ్, కార్యదర్శి లక్ష్మీపతిరాజు, నరేంద్ర, ఆర్.మనోహర్, రీజనల్ కార్యదర్శి నడ్డినారాయణ, డాక్టర్ గిరిజ, మునిలక్ష్మి, యూనివర్సల్ అధ్యక్షుడు ముఖేష్ పాల్గొన్నారు.

'వసతి'కి వస్తువుల వితరణ

తిరుపతి మంగళం : జీవకోనలో రియల్స్ సంస్థ వారు నడుపుతున్న నేతాజీ సుభాష్‌చంద్రబోస్ బాలిక వసతిగృహానికి దాత బి.లలితచంద్ర మరికొందరి సహకారంతో సోమవారం రూ.86వేల విలువైన వస్తువులను వితరణగా అందించారు.



ఆత్మవిశ్వాసంతో సాగుతూ..
ఆదర్శంగా నిలుస్తూ..!

ఆధునిక సమాజంలో కొందరు విద్యార్థులు ఆదర్శవంతంగా ముందుకు సాగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. అండగా నిలిచేవారు లేకపోయినా కష్టపడి పనిచేస్తూ ఇష్టపడి చదువుకుంటున్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్నా భేషజాలకు పోకుండా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మనోధైర్యంతో బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. అందు బాటులోకి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడుతున్నారు. తిరుపతిలోని పలు విశ్వవిద్యాలయాల్లో అత్యున్నత కోర్సుల్లో చేరి లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. **– తిరుపతి సిటీ**

- పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నతంగా చదువుకుంటున్న విద్యార్థులు
- అండగా నిలిచేవారు లేకపోయినా మనోధైర్యంతో విద్యాభ్యాసం
- కష్టపడిన జీతంతో కుటుంబాలకు సైతం ఆసరా
- ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ.. లక్ష్యం దిశగా అడుగులు

నాన్న చనిపోవడంతో కష్టాలు మొదలు



మాది కలకడ మండలం ,కదిరాయచెరువు గ్రామం, ఎస్వీయూలో ఎకనామిక్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నా. నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. అమ్మ రోజు కూలీ పనిచేస్తూ నన్ను చదివించింది. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. అమ్మ కష్టం చూస్తే మనసు బరువెక్కిపోతుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి దారుణం. ఎస్వీయూలో పీజీలో చేరిన నాటి నుంచి హోమ్ ట్యూషన్లు చెప్పుకుంటూ కళాశాల ఫీజు కట్టుకుంటూ చదువు కొనసాగించా. పీజీ పూర్తి చేసి పీహెచ్‌డీలో చేరిన నాటి నుంచి నగరంలో ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ వచ్చిన జీతంతో సగం ఇంటికి పంపి, మిగిలి మొత్తాన్ని నా చదువుకు ఉపయోగించుకుంటున్నా. ఉన్నత ఉద్యోగం సాధించేందుకు పనిచేస్తూ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నా.

- వి.అశోక్ కుమార్, పీహెచ్‌డీ విద్యార్థి, ఎస్వీయూ

చదువు.. కుటుంబం అంతే..



మాది అనంతపురం. నాన్న, అమ్మ వ్యవసాయ కూలీలు. రోజువారి పనుల కోసం వెళుతుండగా యాక్సిడెంట్ జరిగింది. నాన్న అక్కడికక్కడే మరణించారు. అమ్మ కొన్ని నెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. అప్పుడు నేను డిగ్రీ చదువుతున్నా. నాకు తమ్ముడు ఉన్నాడు. ఇద్దరం అనాథలుగా మిగిలిపోయాం. బంధువులు అయ్యో పాపం అన్నారే కానీ, ఎవరూ సాయం చేయలేదు. మాకు ఉన్న చిన్న ఇంటిని అమ్మేసి అప్పులు తీర్చి 2019లో తిరుపతి వచ్చేశాం. తమ్ముడిని ఇంటర్‌లో చేర్పించి, నేను పీజీలో చేరా. ఇద్దరం కళాశాల అనంతరం సాయంత్రం ఓ ప్రైవేట్ హోటల్‌లో సర్వర్లుగా పని చేసేవాళ్లం. వచ్చిన జీతంతో మా చదువులు కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం తమ్ముడు పీజీ చేస్తున్నాడు. నేను ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులో ఈ ఏడాదే సీటు సాధించా.

- ఎస్.నిర్మల, పీహెచ్‌డీ విద్యార్థిని, తిరుపతి

ఆత్మస్థైర్యంతోనే..



మాది కర్నూలు జిల్లా, బోగోలు గ్రామం. అమ్మ, నాన్న రోజువారీ కూలీలు. కష్టపడి పని చేసి నన్ను చదివించారు. ప్రస్తుతం ఎస్వీయూలో పీహెచ్‌డీ చేస్తున్నా. కుటుంబ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని వర్సిటీలో ఇన్విజిలేషన్ చేసుకుంటూ వచ్చిన డబ్బుతో చదువుకుంటున్నా. ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ అందకపోడంతో ఫీజు కట్టడం భారంగా మారుతోంది. నాన్న, అమ్మ కష్టాలను చూడలేక పార్ట్ టైమ్ పని చేస్తూ ఆత్మస్థైర్యంతోనే చదువును కొనసాగిస్తూ, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. మంచి ఉద్యోగం సాధించే వరకు ఇటు కుటుంబం భారం, అటు నా అవసరాలను తీర్చుకునేందుకు కష్టపడుతున్నా.

- జయప్రకాష్, పీహెచ్‌డీ విద్యార్థి, తిరుపతి

తలెత్తుకుని తిరగాలని..



మాది వైఎస్సార్ కడప జిల్లా, జమ్మలమడుగు. ఒకప్పుడు ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబమే. ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కావు. కానీ, పాత కక్షలు, ఫ్యాక్షనిజంతో మా ఆస్తులు కరిగిపోయాయి. నాన్న అప్పులు చేసి బాధలకు ఓర్చుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అమ్మ, నేను, చెల్లి మిగిలిపోయాం. చేతిలో చిల్లిగవ్వలేకుండా తిరుపతి నగరానికి వచ్చేశాం. అమ్మ హోటల్‌లో పాచి పనిచేసేది. చెల్లి ఓ స్వీట్ షాపులో పనిచేస్తుంది. నేను డిగ్రీలో చేరి 10వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ చెప్పేవాడిని. ప్రస్తుతం పీజీ రెండవ సంవత్సరం చదువుతున్నా. డిగ్రీలో 92శాతం మార్కులతో డిస్టింక్షన్‌లో పాస్ అయ్యాను. పీజీ చదువుతూ గ్రూప్స్‌కు ప్రిపరేషన్ చేస్తున్నా. ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించి బంధువుల ఎదుట తలెత్తుకుని తిరగాలని లక్ష్యంతో కష్టపడుతున్నా. **- శోభారాణి, పీజీ విద్యార్థిని, తిరుపతి**

అమ్మ కష్టం చూస్తే..



మాది మదనపల్లె సమీపంలో కుగ్రామం. చిన్నతనంలో నాన్న మద్యానికి బానిసై చనిపోయారు. అమ్మ, అక్క, చెల్లి ఉన్నారు. అమ్మ మదనపల్లెలోని కొన్ని ఇళ్లలో పాచి పని చేస్తుంది. అక్క ఇంటర్ వరకు చదివి ప్రస్తుతం బట్టల దుకాణంలో పని చేస్తోంది. చెల్లి ఇంటర్ చదువుతోంది. అక్క, అమ్మ కష్టపడి పనిచేసి నన్ను పీజీ వరకు చదివించారు. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నా. అమ్మ కష్టం గుర్తుకొచ్చిన ప్రతి క్షణం కళ్లలో నీళ్లు కారిపోతుంటాయి. నిత్యం కటుంబంకోసం ఆమె పడే శ్రమే నన్ను తట్టిలేపింది. పీజీ చదువుతున్నప్పటి నుంచే తిరుపతిలో హోమ్ ట్యూషన్లు చెప్పుకుంటూ నెలకు సుమారు రూ.30వేల వరకు సంపాదిస్తున్నా. అమ్మను పని వెళ్లకుండా నిలిపివేశా. అక్క, నేను ఇంటికి అండగా ఉంటూ చెల్లిని చదివించుకుంటున్నాం. డీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే, ట్యూషన్ చెప్పుకుంటూ పీహెచ్‌డీని కొనసాగిస్తున్నా. **- రవిశంకర్, డీఎస్సీ ప్రిపేర్ అవుతున్న విద్యార్థి, తిరుపతి**

ఘనంగా ఆయుధ పూజ

తిరుమల : తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద టీటీడీ విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి చేతులమీదుగా సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, డీఈ ఎస్.చంద్ర శేఖర్, డిప్యూటీ ఇంజినీర్ వాణి పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకుంటే చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పుత్తూరు మండలం, గేట్ పుత్తూరు జెడ్పీ (తమిళ)ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(తమిళ్)గా పనిచేస్తున్న వీఎస్ బేబీ కస్తూరిబాయ్ జూన్ 25వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పుత్తూరు డీవైఈఓ తమ దృష్టికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. టీచర్ వెంటనే విధులకు హాజరుకాకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

రామచంద్రాపురం: సేంద్రియ విధానంలో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రకృతి సేద్యంతో పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను ఎంపీడీఓ ఇందిరమ్మ, తహసీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. డీపీఎం మాట్లాడుతూ ప్రతి సోమవారం ఈ స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎంటీలు రంగయ్య, సుజాత పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: తిరుపతిలో మూడు వేర్వేరు చోట్ల ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లిన రెండు కేసుల్లో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత సోమవారం తీర్పు చెప్పారు. గత ఏడాది ఆగస్టు 19వ తేదీ రూ.2.5 లక్షల విలువచేసే ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. దీనిపై వాహన యజమాని గణేష్‌కుమార్ తిరుపతి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే గత ఏడాది ఆగస్టు 15వ తేదీన రూ.75 వేలు, రూ.80వేల విలువైన రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. వాటి యజమానుల ఫిర్యాదు మేరకు . పోలీసులు దర్యాప్తు చేసి తిరుపతి నవాబు పేటకు చెందిన కే.సాయికుమార్, వడమాల పేట మండలానికి చెందిన పూజారి మహేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రెండు కేసుల్లో ఇద్దరు నిందితులకు ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

'బెల్ట్' తీయకుంటే సహించం



మాట్లాడుతున్న దామినేటి కేశవులు

తిరుపతి కల్చరల్ : టీడీపీ నేతలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులను తొలగించకుంటే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దామినేటి కేశవులు స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కూరగాయల దుకాణాల్లా వీధికొక్క వైన్‌షాపును ఏర్పాటు చేశారని మండిపడ్డారు. చంద్రగిరి నియోజకవర్గానికి 33 మద్యం దుకాణాలు కేటాయిస్తే, 98 బెల్టు షాపులు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాలకు కూడా ప్రత్యేక వాహనాల్లో మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్ షాపుల కారణంగా పేద కుటుంబాలు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయకుంటే, కనిపించిన బెల్ట్ షాపులను ప్రజలతో కలిసి ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు వాసు, చెంచు మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

తిరుపతి కల్చరల్ : శ్రీవేంకటేశ్వర బధిర ఉన్నత పాఠశాలలో 43 ఏళ్ల క్రితం చదువుకున్న సుమారు 750 మంది పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. బధిర పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో అపూర్వ సమ్మేళనం చేపట్టారు. తమకు విద్యాజ్ఞానం అందించిన 35 మంది గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరిని ఒకరు అలింగనం చేసుకునియోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు జి.మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సి.వెంకట్‌కుమార్, సీఎస్ తాతారావు నారాయణరెడ్డి, ధరణి, సి.మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న రాజశేఖర్, సుచరిత , మోహన్ నాయుడు

తిరుపతి సిటీ : విజయవాడ ఏ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం రాత్రి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అవార్డులు ప్రదానం చేశారు. అందులో తిరుపతికి చెందిన ఆరుగురు అధ్యాపకులు అవార్డులు అందుకున్నారు. వీరిలో ఎస్వీయూ ప్రొఫెసర్లు రాజశేఖర్, కేవీ సుచరిత, పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్లు సీతాకుమారి, శ్రీదేవి, ఉషా, అగ్రికల్చరల్ కళాశాలకు చెందిన జి.మోహన్ నాయుడు ఉన్నారు.

వైభవం.. కార్తీక దీపోత్సవం



కపిలతీర్థం పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ

తిరుపతి కల్చరల్ : కార్తీక మాసంలో దీపారాధనతో పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ మేరకు కార్తీక సోమవారం సందర్భంగా తిరుపతిలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయం, దేవేంద్ర థియేటర్, మంచినీళ్ల గుంట శివాలయాలు, జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయం, మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో భక్తులు దీపారాధన చేపట్టారు. కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

చంద్రగిరి : తొండవాడ స్వర్ణముఖీనది తీరంలో వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

ముక్కోటి ఉత్సవాలకు భూమి పూజ

ఆలయంలో ఏటా నిర్వహించే రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు అర్చకులు శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు.

చందన అలంకరణలో..

చంద్రగిరి ఆర్ఎఫ్‌రోడ్డులో వెలసిన శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో కార్తీక మాస పూజలను ప్రధాన అర్చకుడు డాక్టర్ శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చందన అలంకరణలో స్వామివారు భక్తులకు అభయమిచ్చారు.

తలకోనలో..

భాకరాపేట : తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. భక్తులు తలకోన ఝరిలో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను వెలిగించారు

గ్రీవెన్స్‌కు 38 వినతులు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 38 వినతులను వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. ఈ క్రమంలోనే తమ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్లు అనిల్ కుమార్, నరసింహాచారి కోరారు. అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎస్ఈ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

దూర విద్యలో అడ్మిషన్లకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో పలు కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రధానంగా ఎంఏ తెలుగు, ఎంకామ్, డిప్లొమో ఇన్ సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సులలో ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీ లోపు వర్సిటీలోని దూర విద్యా కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 08772284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కనీస వేతనం కోసం డిమాండ్

తిరుపతి సిటీ : వెటర్నరీ వర్సిటీ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీలోని కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్న బాబు మాట్లాడుతూ 200 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తుంటే కనీసం వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి జీతాలు పెంచాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అలీ, తులసి, మాతయ్య, సుబ్బరాజు, కిరణ్ కుమార్, మంజుల, జ్యోతి, వాణి పాల్గొన్నారు

విద్యుత్ చార్జీలపై నిరసన

తిరుపతి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవంబాబు డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు కాకముందే ప్రజలపై రూ.6 వేల కోట్ల భార మోపడం దారుణ మన్నారు. అనంతరం సీఎండీ సంతోష్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోడపేరు చిట్టిబాబు , వెంకటనరసింహులు, మురళీకృష్ణ, సుప్రజ, శివశంకర్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో వనభోజనాలకు ఏర్పాట్లు

చంద్రగిరి(తిరువానూరు): కార్తీక మాసం సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలు, వనభోజనాలకు వచ్చే వారికి శిల్పారామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏఓ ఖాదర్‌వలీ సోమవారం తెలిపారు. తాగు నీరు, సేదతీరేందుకు ప్రత్యేక కుర్చీలు, ఉసిరి చెట్టు వద్ద ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 88866 52044, 88866 52016 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి రోజూ పక్కాగా చెత్త సేకరణ

తిరుపతి తుడా : నగరంలో ప్రతి రోజూ ఇంటింటికి వెళ్లి పక్కాగా చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో వినతుల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, పన్ను వసూలు తదితర అంశాలపై అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వీధుల్లోకి వాహనాలు సకాలంలో వెళ్లాలని, శానిటరీ సెక్రటరీ పర్యవేక్షించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు మరమ్మతుకు గురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ఉదయం ముందుగా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా చెత్త సేకరణ చేపట్టలేదని ఫిర్యాదులు అందితే ఆ ప్రాంతంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలని, ప్రజల నుంచి వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు.

సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసీకుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవె న్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, డీసీపీ మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన మహోత్సవం



పూజలు చేస్తున్న భజన మండలి కళాకారులు

తిరుపతి కల్చరల్: నగర సంకీర్తన భజన మండలి కళాకారులు కార్తీక మాసం సందర్భంగా సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. రామాపురం సమీపంలోని ఓ వనంలో ఉసిరి చెట్టు కింద పరమశివుని చిత్రపటం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సాహంగా సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో నగర సంకీర్తన భజన మండలి సభ్యులు వాసుదేవరెడ్డి, పులిగోరు ప్రభాకర్‌రెడ్డి, మునినాథ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, చెంగారెడ్డి, చంద్రకళ, విగ్రహాల కల్యాణి, భాగ్యలక్ష్మి, మురళి, తిరుపాలాచారి పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

తిరుపతి రూరల్: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగను తిరుపతి రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తుమ్మలగుంటకు చెందిన కొణిదల తేజ తిరుపతి రూరల్, తిరుపతి వెస్ట్, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు బైక్‌లను దొంగిలించేవాడు. ఇలా మూడు స్టేషన్ల పరిధిలో పలు బైక్ చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం వైకుంఠపురం ఆర్చ్ వద్ద ముద్దాయిని రూరల్ ఎస్ఐ ఎస్కే మూర్తి అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.2.5 లక్షల విలువైన నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బైక్‌లను రూరల్ మండలం గాంధీపురంలోని తన స్నేహితులు వంశీ, దుర్గప్రసాద్‌కు విక్రయించేవాడని సీఐ చిన్నగోవిందు తెలిపారు. వాటిని కూడా రికవరీ చేసి ముద్దాయిని రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.రూరల్ ఎస్ఐ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణీత్ స్కిన్ కేర్ లేజర్ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రణీత్

తిరుపతి తుడా : స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ప్రణీత్ స్కిన్ అండ్ లేజర్ హాస్పిటల్‌ను సోమవారం ప్రారంభించారు. డాక్టర్ ఎస్‌జీ ప్రణీత్ మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో అంతర్జాతీయ స్థాయి స్కిన్ కేర్ ట్రీట్‌మెంట్ అందిస్తామని తెలిపారు. పలు రకాల చర్మవ్యాధులు, హెయిర్‌లాస్, కాస్మోటాలజీ, మంగుమచ్చలు, చేతి గోర్ల సమస్యలు వంటి వ్యాధులకు అధునాతన పరికరాలతో చికిత్స అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.ఆర్ముగం, డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి



గ్రీవెన్స్‌లో అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: గ్రీవెన్స్‌లో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన గ్రీవెన్స్‌కు 184 అర్జీలు రాగా.. అందులో 120 అర్జీలు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం గాలికి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. సీపీఐతోపాటు ఏఐటీయూసీ నేతలు వారికి అండగా నిలిచారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత చంద్రబాబునాయుడు నీరుగార్చారని ఆరోపించారు.